సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 13 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.42 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.42 వేలు పలికాయి.



మెరిసే రాయి వజ్రమైతే..

తొలకరి వర్షాలు పడటంతో వజ్రాన్వేషణ మొదలైంది. వజ్రకరూరు ప్రాంతాల్లోని ఎర్ర నేలల్లో పలువురు అనువణువూ శోధిస్తున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం

39.4°/21.6°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలిక పాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

జిల్లాను తాకిన ఆశల 'నైరుతి'



శ్రీసత్యసాయి జిల్లాను తాకినట్లు చూపుతున్న ఐఎండీ ఛాయాచిత్రం

అనంతపురం అగ్రికల్చర్: 'నైరుతి' రుతుపవనాలు సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లాను తాకినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) విడుదల చేసిన ఛాయాచిత్రం స్పష్టం చేస్తోంది. ఒకట్రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నైరుతి విస్తరించి ప్రభావం చూపిస్తే మంచి వర్షాలు కురిసే అవకాశం ఉంది. జూన్ నుంచి అక్టోబర్ 15 వరకు నైరుతి ప్రభావంతోనే వర్షాలు కురవనున్నాయి. ఈ ఖరీఫ్‌లో 319.6 మి.మీ సాధారణ వర్షపాతంగా పరిగణించారు. అనుకున్న ప్రకారం జూన్, జూలైలో వర్షాలు కురిస్తే 4 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ నెల 15 నుంచి జూలై ఆఖరు వరకు పంటల సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు ఇప్పటికే ప్రకటించారు. కాగా రాగల రెండు రోజులు జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు రేకులకుంటలోని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.అశోక్‌కుమార్ తెలిపారు.

'పోలీసు స్పందన'కు 59 అర్జీలు



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో వివిధ సమస్యలపై 59 అర్జీలు అందాయి. ఎస్పీ ఎస్.వి. మాధవరెడ్డి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీదారుడితో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. అనంతరం వాటిని ఆయా స్టేషన్‌లకు పంపి చట్ట పరిధిలో సమస్యకు పరిష్కారం చూపాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. స్పందనకు వచ్చిన ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అప్పుడే బాధితులు మళ్లీ పోలీసులను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ అధికారి దీన్ని గుర్తించి సమస్య తీవ్రత ఎక్కడ ఉందో తెలుసుకొని న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. 'స్పందన'లో ఎక్కువగా వరకట్నం, కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు, భూ తగాదాలు, ఆర్థిక మోసాలు తదితర సమస్యలపై అర్జీలు అందాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, 'దిశ' స్టేషన్ సీఐ యతేంద్ర, పోలీసు న్యాయ సలహాదారు సాయినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తికి అలహాబాద్ హైకోర్టు జడ్జి

పుట్టపర్తి అర్బన్: అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ వివేక్ కుమార్ సింగ్ మంగళవారం పుట్టపర్తి విచ్చేయనున్నట్లు డీఆర్ఓ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరు నుంచి రోడ్డుమార్గాన రాత్రి 9.30 గంటలకు పుట్టపర్తికి చేరుకోనున్న ఆయన..రాత్రి ప్రశాంతినిలయంలోని శాంతి భవన్‌లో బస చేస్తారని పేర్కొన్నారు. 14వ తేదీ ఉదయం దర్శన వేళల్లో సత్య సాయి బాబా మహాసమాధిని దర్శించుకుంటారని, 15వ తేదీ గురువారం 11 గంటలకు తిరిగి బెంగళూరుకు వెళ్తారని వెల్లడించారు.

వాహనం ఢీకొని కృష్ణజింక మృతి



హిందూపురం: స్థానిక అనంతపురం రహదారిలోని మలుగూరు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో ఓ కృష్ణజింక మృతి చెందింది. సోమవారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న జింకను వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. అటుగా వెళ్తున్న గ్రామస్తులు గుర్తించి సమాచారం అందించడంతో అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించి, జింక కళేబరాన్ని ఖననం చేశారు.



ధర్మవరం చిన్నూరు మున్సిపల్ స్కూల్‌లో విద్యాకానుక కిట్లతో చిన్నారుల సందడి



జగనన్న విద్యాకానుక కిట్లు చూపుతున్న హిందూపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు



పెనుకొండ హైస్కూల్‌లో విద్యాకానుక కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

కానుక.. వేడుక



విద్యాకానుక కిట్‌తో ఓ చిన్నారి ఆనందం

కొత్తగా రెక్కలొచ్చినట్లు చిన్నారులంతా ఎగురుకుంటూ వచ్చి స్కూళ్లలో వాలిపోయారు. 'నాడు– నేడు'తో అందంగా రూపుదిద్దుకున్న తరగతి గదిలో కూర్చుని మురిసిపోయారు. తొలిరోజే అందిన 'విద్యాకానుక'ను అపురూపంగా చూసుకున్నారు.

బడిగంటలు మోగిన వేళ

- జిల్లా వ్యాప్తంగా తెరచుకున్న పాఠశాలలు
- ఉదయం 7.30 గంటలకే ప్రారంభమైన బడులు
- పండుగలా 'జగనన్న విద్యాకానుక' కిట్ల పంపిణీ



అమరాపురం : నిద్రఘట్ట ఎంపీయూపీ స్కూల్‌లో కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



కదిరిలోని వేమన హైస్కూల్‌లో విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పీవీ.సిద్దారెడ్డి

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా సోమవారం పాఠశాలల పునఃప్రారంభం పండుగలా సాగింది. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యార్థులు, సిబ్బంది వేసవి సెలవులు ముగించుకుని సోమవారం ఉత్సాహంగా పాఠశాలలకు హాజరయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అన్ని పాఠశాలలు ఒక పూట మాత్రమే తరగతులు నిర్వహించాయి. ఉదయం 7.30 గంటలకు తరగతులు ప్రారంభమై 11.30 గంటలకు ముగిశాయి. 11.30 నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. ఉదయం 8.30 నుంచి 9 వరకు జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా రాగిజావ పంపిణీ చేశారు.

1.13 లక్షల మందికి విద్యాకానుక కిట్ల పంపిణీ

ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అన్ని పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ వేడుకగా సాగింది. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు స్కూల్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. జిల్లాలో 1 నుంచి పదో తరగతి వరకు 1,56,976 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, తొలిరోజే 1.13 లక్షల మందికి విద్యాకానుక కిట్లు పంపిణీ చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పాఠ్య, నోటు పుస్తకాలు, బెల్ట్, షూ, బ్యాగు తదితర 9 రకాల సామగ్రి అందజేయడంతో విద్యార్థులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు.

మంచి మార్కులతో పాసవుతా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాకోసం ఎన్నో మంచి పనులు చేస్తున్నారు. 'నాడు–నేడు'తో మా పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపర్చారు. చక్కగా చదువు కోవడానికి విద్యాకానుక కిట్లు ఇస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో బాగా చదువుకుని పదో తరగతి పబ్లిక్ పరీక్షలో మంచి మార్కులతో ర్యాంక్ సాధిస్తా.

–తహసిన్ భాను, పదో తరగతి విద్యార్థిని, కంచి సముద్రం, లేపాక్షి మండలం

మా స్కూల్ చాలా బాగుంది



ఈరోజు పాఠశాలకు వెళ్లగానే పుస్తకాలు, యూనిఫాంలు, షూ, బ్యాగ్.. అన్నీ ఇచ్చారు. మా స్కూల్ కూడా రంగురంగుల బొమ్మలతో అందంగా ఉంది. స్కూల్‌లో మంచి రాగి జావ ఇచ్చారు. మా కోసం ఇన్ని మంచి పనులు చేస్తున్న జగన్ మామయ్య మేలు ఎప్పటికీ మరువలేం.

–సాయి శశి, మూడో తరగతి, గోకులం పాఠశాల, పుట్టపర్తి

బాగా చదువుకుంటా



ఈ రోజు స్కూల్‌లో చదువుకోవడానికి అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బూట్లు, యూనిఫాం, బ్యాగ్ ఇచ్చారు. జగన్ మామయ్యే ఇవన్నీ నాకు పంపారంట. చాలా ఆనందంగా ఉంది. నేను బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకుంటా.

–అభిషేక్, ఐదో తరగతి, ఎనుములపల్లి పాఠశాల, పుట్టపర్తి

తొలిరోజు 70 శాతం పంపిణీ



జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకున్నాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 17వ తేదీ వరకూ ఒంటి పూట బడి నిర్వహిస్తున్నాం. తొలి రోజు జిల్లా వ్యాప్తంగా 70 శాతం వరకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశాం. మరో రెండు రోజులలో వంద శాతం పంపిణీ పూర్తి చేస్తాం.

–రంగస్వామి, ఇన్‌చార్జ్ డీఈఓ

రాష్ట్రంలోనే తొలి మహిళా సహకార డెయిరీ

- 'అమ్మ' పాల డెయిరీ రేపే ప్రారంభం
- ఆలమూరు జగనన్న లే అవుట్ పక్కన ఏర్పాటు
- రూ.20 కోట్ల సొంత ఖర్చుతో డెయిరీ నెలకొల్పిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- జిల్లాలోని పాడి మహిళా రైతులకు చేయూత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో పైలా తదితరులు



డెయిరీలో ఏర్పాటు చేసిన మిషనరీ

రాప్తాడురూరల్: రాష్ట్ర చరిత్రలో తొలి మహిళా సహకార డెయిరీ ఏర్పాటుకు రాప్తాడు నియోజకవర్గం వేదిక కాబోతోంది. పాడి మహిళా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆర్థికాభివృద్ధి వైపు నడిపించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని దాదాపు రూ. 20 కోట్ల సొంత నిధులతో అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లేఅవుట్ పక్కన ఐదెకరాల స్థలంలో డెయిరీ నిర్మించారు. ఈ డెయిరీకి 'అమ్మ' (అనంతపురం మహిళా మిల్క్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్) అని నామకరణం చేశారు. ఈ నెల 14న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా డెయిరీ ప్రారంభం కానుంది. దాదాపు 20 వేలమంది మహిళా పాడి రైతులకు నికర ఆదాయం కల్పించాలనే సంకల్పంతో 'అమ్మ డెయిరీ' ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈ డెయిరీని నియోజకవర్గంలోని పాడి మహిళా రైతులకు అంకితం చేయనున్నారు.

ములకనూరు డెయిరీ ఆదర్శం

తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా భీమదేవరపల్లి మండలం ములకనూరు గ్రామంలోని 'ములకనూరు మహిళా సహకార డెయిరీ' దేశంలోనే మొదటి మహిళా డెయిరీ. ఈ డెయిరీకి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. మహిళా రైతులు 'ములకనూరు మహిళా సహకార డెయిరీ'లో భాగస్వాములై చేయిచేయి కలిపి ఆర్థిక ప్రగతి సాధించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పలుమార్లు ఈ డెయిరీని సందర్శించారు. అక్కడి మహిళా రైతుల విజయగాథను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. దీన్ని ఆదర్శంగా తీసుకునే 'అమ్మ' డెయిరీ ఏర్పాటుకు పూనుకున్నారు.

'అమ్మ' డెయిరీని ఆదరించండి

అనంతపురం టవర్‌క్లాక్: పాడి మహిళా రైతులకు ఆదాయం చేకూరేలా ప్రారంభిస్తున్న 'అమ్మ' డెయిరీని ఆదరించాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. సోమవారం అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆలమూరు జగనన్న లే ఔట్ వద్ద ఏర్పాటు చేసిన 'అమ్మ' డెయిరీని బుధవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇతర పాల డెయిరీలు లాభార్జన కోసమే వ్యాపారాలు చేస్తున్నాయని, కానీ 'అమ్మ' డెయిరీ ఇతర డెయిరీల కంటే లీటరుపై రూపాయి ఎక్కువగా పాడి రైతులకు చెల్లిస్తుందన్నారు. వినియోగదారులకు రూపాయి తక్కువతో పాలు అందిస్తామన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 5 వేల నుంచి 10 వేల మందికి ఆవుల కొనుగోలుకు రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. పాల ఉత్పత్తులన్నీ డెయిరీలో తయారు చేస్తామని, త్వరలోనే అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పాల కేంద్రాలు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నాయకులు ధనుంజయ యాదవ్, చిత్రా వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే..

సహకార వ్యవస్థను పునర్నిర్మాణం చేసే ప్రయత్నంలో భాగంగా 'తోపుదుర్తి మహిళా సహకార డెయిరీ సమాఖ్య లిమిటెడ్' ఆధ్వర్యంలో 'అమ్మ' డెయిరీని ఏర్పాటు చేస్తున్నాం. పాడి మహిళా రైతులతో ఫెడరేషన్ ఏర్పాటు చేశాం. ఇది పూర్తిగా మహిళా రైతులదే. వారే కూలీలు, వారే యజమానులు. డెయిరీని నడుపుకొనే నైపుణ్యం సాధించేదాకా తోపుదుర్తి కుటుంబం సహకారం అందిస్తుంది. జిల్లా ప్రజలందరి సహకారం ఉండాలి. డెయిరీకి పాలు పోసే రైతులందరూ యజమానులు. కూలీలు వారే, ఆదాయమూ వారికే.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే

విద్యతోనే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన

- బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో కలెక్టర్ అరుణ్‌బాబు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: విద్యతోనే బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించవచ్చని, బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు పిలుపునిచ్చారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కార్మిక శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బాల కార్మిక వ్యతిరేక మాసం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, బడీఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలుంటాయన్నారు. అనంతరం కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సత్యమ్మ ఆలయం సర్కిల్ వరకూ కొనసాగింది.

వైఎస్సార్ బీమాకు రేపటితో ఆఖరు



బీమా నమోదు చేస్తున్న వలంటీర్ శిరీష

పుట్టపర్తి అర్బన్: కుటుంబ పెద్ద ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబం ఎటువంటి ఇబ్బందులు పడకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ బీమాతో ఆదుకుంటున్నారు. రూపాయి ఖర్చు లేకుండా వలంటీర్ల సహకారంతో ఏటా ఇంటి యజమాని చేత బీమాను రెన్యూవల్ చేయిస్తున్నారు. వైఎస్సార్ బీమా కింద కుటుంబ యజమాని సహజంగా మరణిస్తే రూ. లక్ష, ప్రమాదవ శాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.5 లక్షల పరిహారం అందజేస్తారు.

జిల్లాలో 5.12 లక్షల మందికి లబ్ధి

జిల్లా వ్యాప్తంగా 5,12,419 మంది వైఎస్సార్ బీమా లబ్ధిదారులున్నారు. ఇందులో ఈ ఏడాది ఇప్పటివరకూ 4,44,300 మంది వేలి ముద్రలు తీసుకొని రెన్యూవల్ చేశారు. ఇంకా 68,119 మంది రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. బుధవారంతో వైఎస్సార్ బీమా రెన్యూవల్, ఎన్‌రోల్ మెంట్ గడువు ముగియనుండగా, వారందరి వేలిముద్రలు సేకరించేందుకు వలంటీర్లు సిద్ధమయ్యారు. వీటికి తోడు కొత్తగా 10,760 మంది ఎన్‌రోల్ చేసుకున్నారు. రెండు రోజుల్లో వీరందరి వేలిముద్రలు సేకరించి రెన్యూవల్, ఎన్‌రోల్ మెంట్ పూర్తి చేయనున్నట్లు జిల్లా నోడలాఫీసర్ శివారెడ్డి తెలిపారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

- 'జగనన్నకు చెబుదాం', స్పందన ఫిర్యాదులకు ప్రాధాన్యం
- కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం
- అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'జగనన్నకు చెబుదాం', 'స్పందన' కార్యక్రమాల్లో అందే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్యలతో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం', 'స్పందన' కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో అర్జీలను స్వీకరించారు. వివిధ సమసలపై మొత్తం 210 అర్జీలు అందగా, అధికారులు వాటిని పరిశీలించి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు.

రోజువారీ సమీక్ష చేయాలి

స్పందన అర్జీల పరిష్కారంపై వివిధ శాఖల ఉన్నతాధికారులు రోజువారీ సమీక్ష చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. స్పందన కార్యక్రమం అనంతరం ఆయన డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్పందన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను గడువులోపు పరిష్కరించాలన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేకపోతే చర్యలు

మండలాలకు నియమించిన ప్రత్యేకాధికారులు మండలాలను సందర్శించి ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. కేటాయించిన లక్ష్యాలను చేరుకున్నారా లేదా అనే దానిపై రోజూ సాయంత్రం 6.30 గంటలకు రిపోర్టు అందించాలన్నారు. లక్ష్యాలను చేరుకోకపోతే ప్రతి ఆదివారం ఉదయం పుట్టపర్తిలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలన్నారు. ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ అధికారులు ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హౌసింగ్ నిర్మాణలపై నిర్లక్ష్యం వహించే ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లపై క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు శ్రద్ధ వహించాలన్నారు. ఆగస్టు 31వ తేదీ నాటికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు.

ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలి

అర్హులంతా వైఎస్సార్ బీమా పథకంలో నమోదయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులు పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ఎన్‌సీడీ, సీడీ సర్వే ఈనెల 16వ తేదీ (శుక్రవారం) నాటికి 80 శాతం పూర్తి కావాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతల్లో అనీమియా నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్ ఖాన్, సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డ్వామా పీడీ రామాంజనేయులు, సోషల్ వెల్ఫేర్ అధికారి శివరంగప్రసాద్ పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

సోమందేపల్లి: ఖాతాదారుడికి తెలియకుండా బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయమైన కేసులో మనీ ట్రాన్స్‌ఫర్ ఏజెన్సీ నిర్వాహకుడిపై చీటింగ్ కేసు నమోదైంది. ఈ మేరకు సోమందేపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొలిమిపల్లికి చెందిన మహేష్ ఇటీవల సోమందేపల్లిలోని ఓ మనీ ట్రాన్స్‌ఫర్ కేంద్రానికి వెళ్లి తన వేలి ముద్ర ఆధారంగా నగదు డ్రా చేసుకున్నాడు. అనంతరం ఆ ఖాతా నుంచి రూ.32,020 మాయమైంది. ఘటనపై సోమవారం సాయంత్రం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మనీ ట్రాన్స్‌ఫర్ సెంటర్ నిర్వాహకుడు సురేష్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు.

పంచాయతీరాజ్ ఈఈపై వేటు

అనంతపురం సిటీ: ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ ఇన్‌చార్జ్ ఈఈ రవిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్ సోమవారం తెలిపారు. ఆయనను తాడిపత్రి సబ్ డివిజన్ డీఈఈగా పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

మెరిసే రాయి.. వజ్రమైతే..



తొలకరి పలకరించగానే వారిలో ఆశలు చిగురిస్తాయి. సద్ది సిద్ధం చేసుకుని పొలాల బాట పడతారు. నేలలో అణువణువూ శోధిస్తారు. ప్రతి రాయి కదుపుతారు. మెరిసే రాళ్లను సేకరిస్తారు. వాటిని తీసుకెళ్లి ఏజెంట్లకు చూపుతారు. అది వజ్రమైతే వారి పంట పండినట్లే! లేదంటే మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతారు. ఇలా ఏటా వజ్రాల వేట నిరాటంకంగా సాగుతోంది. దశాబ్దాలుగా సాగుతున్న ఈ వేటలో కొందరు లక్షాధికారులు కాగా... మరికొందరు అన్వేషకులుగానే మిగిలిపోయారు.

- ఎర్రనేలల్లో జోరుగా వజ్రాల వేట
- సుదూర ప్రాంతాల నుంచి సైతం జనం రాక
- సందడిగా మారిన వజ్రకరూరు పరిసర పొలాలు
- దశాబ్దాలుగా కొనసాగుతున్న వజ్రాన్వేషణ
- ఏటా కొందరిని వరిస్తున్న 'అదృష్టం'



అన్వేషణ ఫలించేనా? : వజ్రకరూరు పరిసర పొలాల్లో వజ్రాల కోసం వెతుకుతున్న జనం



వజ్రకరూరులోని డైమండ్ ప్రాసెసింగ్ ప్లాంట్



పిల్లలతో కలసి వజ్రాన్వేషణకు వచ్చిన దంపతులు

అనంతపురం డెస్క్: వజ్రాల పేరు చెప్పగానే టక్కున గుర్తుకొచ్చే ఊరు వజ్రకరూరు. ఇక్కడ దొరుకుతున్న వజ్రాల కారణంగానే కవులూరు గ్రామం కాస్తా కాలక్రమేణా కరూరుగా..వజ్రకరూరుగా రూపాంతరం చెందింది. ఇక్కడ వజ్రాలు ఉన్నట్లు బ్రిటీష్ హయాంలోనే గుర్తించారు. అప్పట్లోనే ప్రత్యేక కంపెనీ ఏర్పాటుచేసి అన్వేషణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వపరంగా వజ్రాన్వేషణ అంత లాభదాయకంగా లేదు కానీ.. సామాన్యుల అన్వేషణ మాత్రం ఏటా కొనసాగుతూనే ఉంది.

తొలకరి పలకరించగానే..

ప్రతి ఏటా జూన్ మొదటి వారంలో తొలకరి వర్షాలు మొదలు కాగానే వజ్రకరూరు ప్రాంతం కొత్త వ్యక్తులతో కళకళలాడుతూ ఉంటుంది. వజ్రకరూరు చుట్టూ ఐదు కిలోమీటర్ల మేర ఎర్రనేలలు జనంతో రద్దీగా కనిపిస్తాయి. ఒక్కో పొలంలో 30-40 మంది వజ్రాల కోసం వెతుకుతుంటారు. బలమైన వర్షాలు పడినప్పుడు ఈ సంఖ్య వందకు పైగానే ఉంటుంది. వాననీటి ప్రవాహం వల్ల భూమిలోని వజ్రాలు పైకి తేలి.. దిగువ ప్రాంతాలకు కొట్టుకొచ్చే అవకాశం ఉండడంతో ఎక్కువమంది ఆ దిశగా అన్వేషణ సాగిస్తుంటారు. స్థానికులే కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలలు, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలు, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా వాహనాల్లో ఇక్కడికి వచ్చి వజ్రాన్వేషణలో నిమగ్నమవుతున్నారు. ఇతర ప్రాంతవాసుల రాక 15 ఏళ్లుగా ఎక్కువైంది. కొందరు రోజుల తరబడి స్థానికంగానే ఉంటూ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఏటా 10- 15 వజ్రాలు!

వజ్రకరూరు ప్రాంతంలో లభించే వజ్రాలు అత్యంత విలువైనవిగా చెబుతుంటారు. రూ.లక్ష మొదలుకుని రూ.50 లక్షలకు పైగా విలువైన వజ్రాలు ఇక్కడ లభిస్తున్నట్లు సమాచారం. వజ్రకరూరు, రాగులపాడు, కమలపాడు, బోడిసానిపల్లి, పొట్టిపాడు గ్రామాల పరిధిలోని ఎర్ర నేలల్లో అన్వేషించే వారికి ఏటా 15 నుంచి 20 వజ్రాలు దొరుకుతున్నట్లు అంచనా. వీటిని గుత్తి, కర్నూలు జిల్లా పెరవలి, జొన్నగిరి తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా కొనుగోలు చేస్తున్నారు. వజ్రం రంగు, జాతిని బట్టి క్యారెట్ల రూపంలో లెక్కగట్టి ధర నిర్ణయిస్తున్నారు. విక్రయదారులకు డబ్బుతో పాటు బంగారం ముట్టజెబుతున్నారు. విక్రయదారులకు ధర నచ్చని పక్షంలో వ్యాపారులు టెండర్ పద్ధతిలో వజ్రాలను కొనుగోలు చేస్తుండడం గమనార్హం. వజ్రాన్వేషణ జరిగే ప్రాంతాల్లో ప్రత్యేకంగా తమ మనుషుల (ఏజెంట్లు)ను పెట్టి వజ్రాలు దొరికిన వారి సమాచారాన్ని వ్యాపారులు సేకరించుకుంటున్నారు.

ఇక్కడే ఎందుకంటే..

వజ్రకరూరుతో పాటు ఈ ప్రాంతానికి 50 కి.మీ.లోపే దూరం ఉన్న కర్నూలు జిల్లా జొన్నగిరి, తుగ్గలి, పగిడిరాయి ప్రాంతాల్లోనూ వజ్రాలు లభిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో వజ్రాలు లభించే కింబర్‌లైట్ పైపులు భూఉపరితలానికి అతి దగ్గరలో ఉన్నాయని గనులు, భూగర్భశాఖ అధికారులు చెబుతున్నారు. దానికితోడు ఈ ప్రాంతంలోని భూమి గడిచిన ఐదువేల సంవత్సరాల్లో దాదాపు అర కిలోమీటరు మేర కోతకు గురైందని, అందుకే ఇక్కడ తరచూ వజ్రాలు దొరుకుతున్నాయని అంటున్నారు. వజ్రకరూరు ప్రాంతంలో వజ్రాన్వేషణకు 1934 సంవత్సరంలోనే బ్రిటీష్ వారు 'ది న్యూ వజ్రకరూరు డైమండ్ మైనింగ్ కంపెనీ లిమిటెడ్' స్థాపించారు. వజ్రాలు లభించే పొలాలను సేకరించారు. ఈ కంపెనీని స్వాతంత్ర్యం వచ్చాక 1970లో నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ) పరిధిలోకి తెచ్చారు. 1974 నుంచి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) ఆధ్వర్యంలో వజ్రాన్వేషణ చేపడుతున్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలోనే వజ్రకరూరులోని వజ్రాల ప్రక్రమణ కేంద్రం (డైమండ్ ప్రాసెసింగ్ ప్లాంట్) నడుస్తోంది. ఒకప్పుడు ఇక్కడ కార్యకలాపాలు చురుగ్గా జరిగేవి. వివిధ కారణాలతో ప్రస్తుతం మందగించాయి. కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా ఈ ప్రాంతంలోని వజ్ర నిక్షేపాలపై దృష్టి సారించినప్పటికీ మైనింగ్‌కు మాత్రం ముందుకు రాలేదు.

ఏటా వస్తుంటా



ఈ ప్రాంతంలో లభించే వజ్రాలు మంచి ధర పలుకుతాయి. అందుకే ఏటా తొలకరి వర్షాలు మొదలుకాగానే ఇక్కడికి వస్తుంటా. ఎప్పుడో ఒకసారైనా అదృష్టం వరించకపోతాదా అన్న ఆశతో వెతుకుతున్నా. నాతో పాటు మా ప్రాంతం నుంచి చాలామంది ఇక్కడికి వస్తుంటారు.

– సురేష్, పత్తికొండ, కర్నూలు జిల్లా

చిన్న వజ్రం దొరికినా చాలు..



ఈ ప్రాంతంలో చాలా కాలం నుంచి వజ్రాల కోసం వెతుకుతున్నారు. నేను కూడా వర్షం వచ్చిన ప్రతిసారీ ఇక్కడ వెతుకున్నా. చిన్న వజ్రం దొరికినా చాలు కష్టాలు తీరిపోతాయి. వజ్రం దొరుకుతుందన్న ఆశతోనే వచ్చా.

– లక్ష్మి, ఛాయాపురం, వజ్రకరూరు మండలం

మూడోసారి వచ్చా



వజ్రాలు వెతకడానికి మూడో సారి వచ్చా. అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నా. వజ్రం దొరికితే మా తలరాత మారుతుంది.

– నాగరాజు, దిబ్బసానిపల్లి, పామిడి మండలం

బ్రిటీష్ కాలం నుంచే లభ్యం



మండలంలో బ్రిటీష్ కాలం నుంచే వజ్రాలు దొరుకుతున్నాయి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి సైతం వచ్చి ఇక్కడ అన్వేషిస్తుంటారు. ఇండియన్ ట్రెజరీ ట్రోవ్ యాక్ట్ - 1876 ప్రకారం భూమిలో దొరికే విలువైన ఖనిజాలను ప్రభుత్వానికి అప్పగించాలి. కానీ వజ్రాలు దొరికే సమాచారం మా వరకు రావడం లేదు.

– అనిల్‌కుమార్, తహసీల్దార్, వజ్రకరూరు

15న దివ్యాంగులకు మోటారు వాహనాల పంపిణీ



పంపిణీకి సిద్ధం చేసిన వాహనాలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు ఈ నెల 15న త్రిచక్ర మోటారు వాహనాలను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్ రసూల్ సోమవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి గత నెల కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి మొత్తం 60 మంది అర్హులను ఎంపిక చేశారు. ఒక్కో నియోజకవర్గానికి 10 వాహనాల చొప్పున కేటాయించారు. గురువారం ఉదయం 9.30 గంటలకు పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో వాహనాల పంపిణీ కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షఫీ, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ హరినాథరెడ్డి హాజరు కానున్నారు.

పోక్సో కేసులో ముద్దాయి అరెస్ట్

గోరంట్ల: పోక్సో కేసులో జైలు శిక్ష పడి, పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుని తిరుగుతున్న ముద్దాయి ఎట్టకేలకు పట్టుబడ్డాడు. గోరంట్ల సీఐ సుబ్బరాయుడు తెలిపిన మేరకు... గోరంట్ల మండలం గంగాదేవిపల్లికి చెందిన రవీంద్రారెడ్డి 2004లో అదే గ్రామానికి చెందిన ఓ బాలిక పాఠశాలకు వెళుతుండగా మార్గమధ్యంలో అటకాయించి లైగింక దాడికి పాల్పడ్డాడు. ఘటనకు సంబంధించి బాధిత బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అప్పట్లో పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసిన నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులో తుది తీర్పును 2005లో వెలువరించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ముద్దాయి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో అక్కడ కూడా అతని చుక్కెదురైంది. అప్పటి నుంచి పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ముద్దాయికి ఇటీవల పెనుకొండ న్యాయస్థానం నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో పోలీసులు విస్తృత గాలింపు చేపట్టి సోమవారం రవీంద్రారెడ్డిని అరెస్ట్ చేసి, పెనుకొండ న్యాయస్థానంలో హాజరుపరిచారు.

బ్రిడ్జిపై నుంచి వాహనం బోల్తా



ఐచర్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగస్వామి

రొద్దం: మండలంలోని పెద్దమంతూరు వద్ద బ్రిడ్జిపై నుంచి ఓ ఐచర్ వాహనం అదుపు తప్పి పెన్నానదిలోకి బోల్తాపడింది. సోమవారం ఉదయం పెనుకొండ వైపు నుంచి మడకశిర వైపుగా పాలీస్ బండలతో వెళుతున్న ఐచర్ వాహనం డ్రైవర్ వేగ నియంత్రణ కోల్పోయి బ్రిడ్జి రక్షణ వలయాన్ని ఛేదించుకుని పెన్నానదిలోకి దూసుకెళ్లాడు. ఘటనలో ఐచర్ వాహనం నుజ్జునుజ్జైంది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఘటనపై ఎస్‌ఐ నాగస్వామి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రిమాండ్‌కు వాహనాల దొంగ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి సొమ్ము చేసుకుంటున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను సోమవారం అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ రెడ్డప్ప వెల్లడించారు. బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన దేగల సాయి అలియాస్ దొంగ సాయి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. తన వ్యసనాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం ద్విచక్ర వాహనాలను అపహించుకెళ్లి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలో పలు మార్లు పోలీసులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. ఆదివారం రాత్రి అనంతపురంలోని పాతూరులో ఓ ద్విచక్ర వాహనాన్ని అపహరిస్తూ పోలీసులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ద్విచక్ర వాహనంతో పాటు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నేత్రాలు దానం



శ్రీధర్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: చిరు ప్రాయంలోనే గుండెపోటుతో మృతి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. వివరాలు... ధర్మవరంలోని యాదవవీధికి చెందిన రాంప్రసాద్ కుమారుడు తలుపుల శ్రీధర్ (25) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు, డాక్టర్ బీవీ సుబ్బారావు.. మృతుని తండ్రి రాంప్రసాద్‌తో మాట్లాడి నేత్రదానానికి ఒప్పించారు. అనంతరం శ్రీధర్ నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ టెక్నీషియన్ గంగాధర్ సేకరించారు. కుమారుడు మృతిచెందిన బాధలో ఉన్నా.. నేత్రదానానికి అంగీకరించిన తల్లిదండ్రులకు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పెనుకొండ రూరల్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్ తెలిపిన మేరకు... పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన హరిజన నరేంద్ర (24) కియా అనుబంధ పరిశ్రమలో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు దుద్దేబండ క్రాస్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

సీఎం చొరవతోనే విద్యారంగ అభివృద్ధి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ



కల్లూరులో సచివాలయం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ ఇక్బాల్

లేపాక్షి: రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతోనే సాధ్యమైందని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏపీలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలను సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. లేపాక్షి మండలం కల్లూరులో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ఉదయం ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌తో కలసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి కూలీలకు గడ్డ పారలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం లేపాక్షిలోని ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదిగేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారం చేశారన్నారు. తద్వారా గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, రైతు భరోసా కేంద్రాలతో వ్యవసాయాన్ని పండుగ చేసిన ఖ్యాతి సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు ఓరియంటల్ పాఠశాల వద్ద, కల్లూరు సచివాలయం వద్ద బోరుబావి, కల్లూరు నుంచి బైరాపురం వరకూ బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ బాబు, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస రెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, నీలావతి, గ్రామ సర్పంచ్‌లు ఆదినారాయణ, అశ్వత్థనారాయణ, వసుంధర, రత్నమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొండూరు వేణుగోపాలరెడ్డి, మండల కన్వీనర్ నారాయణ స్వామి, నాయకులు ప్రభాకర్, శంకరప్ప, తిప్పన్న, హనుమంతప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

బత్తలపల్లి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లికి చెందిన డి.గిర్రెప్ప(45), వరలక్ష్మి దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాళ్లు కొట్టి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. నెల రోజుల క్రితమే కుమార్తెకు వివాహం జరిపించారు. ఆదివారం ఉదయం రాళ్లు కొట్టే పనికి వెళ్లిన గిర్రెప్ప... రాత్రి 10 గంటలకు స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. గ్రామ సమీపంలోకి చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన గిర్రెప్పను బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్యే పరామర్శ : గిర్రెప్ప మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సోమవారం ఉదయం ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. గిర్రెప్ప మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు ముత్తలూరు హరి, శ్రీనివాసులు, బోయపాటి సూరి, డీలర్ ఆదెప్ప, వెంకట్రాముడు, ప్రసాద్, రామాంజనేయులు, గోపాల్, కుంచపు హరి తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమాలను రిజిస్టర్ చేసుకోండి

అనంతపురం రూరల్: ఉమ్మడి జిల్లాలో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలనుకునే వారు తప్పనిసరి రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వృద్ధాశ్రమాలు నిర్వహిస్తున్న వారు, నిర్వహించాలనుకునే వారు రూ.100 డిమాండ్ డ్రాఫ్ట్ లేదా క్రాస్ చెక్‌ను వెంటనే వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఆశ్రమాలు ఏర్పాటు చేస్తే రూ.25 వేలు జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు 'ఏసీఎల్' తుదిపోరు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా సాగుతున్న అనంతపురం క్రికెట్ లీగ్ (ఏసీఎల్) ఫైనల్ మ్యాచ్ మంగళవారం నిర్వహించనున్నారు. ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌లో అనంత రైజింగ్ స్టార్ మొత్తం 6 మ్యాచ్‌ల్లో 5 మ్యాచ్‌లు గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకోగా... 6 మ్యాచ్‌ల్లో 3 మ్యాచ్‌లను కోగటం వారియర్స్ గెలుపొంది తుదిపోరుకు సిద్ధమైంది. మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఫైనల్ మ్యాచ్‌ను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ తదితరులు హాజరుకానున్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం



అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

చిలమత్తూరు: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని సోమవారం ఉదయం చిలమత్తూరు పోలీసులు ధ్వంసం చేశారు..ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. 19 కేసుల్లో పట్టుబడిన మొత్తం 1,735 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేసినట్లు వివరించారు. వీటి విలువ దాదాపు రూ.6.94 లక్షలు ఉంటుందన్నారు..అలాగే రూ.35 వేలు విలువ చేసే గుట్కా ప్యాకెట్లను సైతం ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.